# బైబిలు పేర్ల పరిశీలన

**(By Dr. Hephzibah Sunkari)**

జీవధారణకు ప్రాణ వాయువు ఎంత అవసరమో, వ్యవహారణానికి పేరు అంత అవసరం. అసలు మానవ జీవితంలో పేరు యొక్క ఆవశ్యకతలేని వ్యవహారమే లేదనడం అతిశయోక్తి కాదు. ఆధునిక కాలంలో ఈ పేర్లని వివరించే శాస్త్రం కూడ ఒకటి ఉంది దీన్ని నామవిజ్ఞాన శాస్త్రం, ఆంగ్లంలో "ఒనమాస్టిక్స్" (onomastics) అని అంటారు. పేరుని గ్రీకు భాషలో "ఓనామా" అని, హీబ్రూ భాషలో "షేము (shem) అని అంటారు. సృష్టిలో మానవులకే గాక కంటికి కనిపించే స్థల, వృక్ష, జంతు, గృహ, వస్తు మొదలగు వాటన్నిటికి పేర్లుంటాయి. పేర్లు ఆకాశం నుండి హఠాత్తుగా ఊడిపడ్డవి కావు. మనుష్యుల పేర్లయినా, ఇంటిపేర్లయినా, స్థలాల పేర్లయినా వేల సంవత్సరాల వివిధ సామాజిక స్థితిగతులకు, అవసరాలకు అనుగుణంగా ఏర్పడ్డవే. మానవ సంబంధాలు బహు విస్తృతాలు. వ్యక్తి ఒంటరిగా బ్రతుకలేడు. తన చుట్టూ ఉన్న సమాజంతో అతడికి సంబంధముంది. ఈ సంబంధం వ్యక్తి బ్రతికి ఉన్నంత కాలమే కాదు, అతని మరణానంతరం కూడ కొనసాగుతుంది. కాబట్టి ప్రతి వ్యక్తికి గుర్తింపు అవసరం. ఆ గుర్తింపే పేరు. వ్యక్తి నామాలపై వివిధ ప్రభావాలుంటాయి. వ్యక్తుల పేర్లు సమాజం యొక్క మత, సంస్కృతి, నాగరికతలకు ప్రతిబింబాలు. ఇంత విస్తృతమైన ఈ పేర్లలో బైబిలు పేర్లకు ప్రత్యేకమైన స్థానముంది. దాన్ని ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

**బైబిలు పేర్ల పరిశీలన:** నామావశ్యకతను తెలియపరచినవాడు దేవుడని, మొట్టమొదట నామకరణం చేసినవాడు దేవుడేనని బైబిలు తెరవడంతోనే మనకవగతమవుతుంది. ప్రారంభంలో దేవుడు తాను సృజించిన వాటన్నిటికి పేర్లు పెట్టడం ద్వారా పేరుకి ఉన్న ప్రాధాన్యాన్ని మనిషికి తెలియజేశాడు. ఉదా : ఆదికాండం 1:5,8,10. "దేవుడు వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రి అనియు పేరు పెట్టెను." " దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరు పెట్టెను." "దేవుడు ఆరిన నేలకు భూమి అని పేరు పెట్టెను." అంతే కాదు, సృష్టిలోని వాటన్నిటికి పేర్లు పెట్టనిచ్చుట ద్వారా మనిషికి సృష్టితో ఉన్న సంబంధాన్ని, ఆ సంబంధాన్ని వ్యక్తీకరించే సామర్థ్యాన్ని కలుగజేశాడు. ఉదా: ఆది. 2:19 "దేవుడైన యెహోవా ప్రతి భూ జంతువును, ప్రతి ఆకాశపక్షిని నేలనుండి నిర్మించి ఆదాము వాటికి ఏ పేరు పెట్టునో చూచుటకు అతని యొద్దకు వాటిని రప్పించెను." ప్రకటన 2:17 లో "జయించువానికి ... ఆ రాతి మీద చెక్కబడిన ఒక క్రొత్తపేరుండును....". దీన్నిబట్టి

పేరు అనేది దేవునికి, మనకి గల వ్యక్తిగత సంబంధాన్ని సూచించడమేకాదు, పరలోకంలో కూడా పేరుకెంత ప్రాధాన్యత ఉన్నదో తెలుస్తుంది.

దేవుని పేర్లను పరిశీలిస్తే అవి ఆయన గుణగణాల్ని, వ్యక్తిత్వాన్ని సూచిస్తున్నట్లు కనుగొనవచ్చు. ఉదాహరణకు ఎలోహీం=దేవుడు; ఎల్ ఎల్యోన్=సర్వోన్నతుడగు దేవుడు; ఎల్ రోయి=చూచుచున్న దేవుడు; యేసు=రక్షకుడు; ఇమ్మానుయేలు=దేవుడు మనకు తోడు. ప్రభువు నేర్పిన పరలోక ప్రార్ధనలో "నీ నామము పరిశుద్ధపరచబడును గాక" అని నేర్పించుట ద్వారా నామ ప్రాధాన్యతని మనకు వివరించారు.

ఈనాడు పేరు అర్ధరహితమైన గుర్తుగా మారింది. కాని బైబిలు కాలంలో పేర్లని చాల అర్ధవంతంగా పెట్టేవారని బైబిలు చదివితే మనకర్ధమవుతుంది. బైబిలులో నామకరణ పద్ధతులు కొన్ని కనిపిస్తున్నాయి. పేర్లు మనుషుల విధుల్ని, లేదా సంబంధాన్ని, తెలియజేసేవిగా ఉండేవి. ఉదా: "యోషియా కుమారుడయిన ఎల్యాకీమును అతని తండ్రియైన యోషియాకు మారుగా రాజుగా నియమించి అతనికి యెహోయాకీమను మారుపేరు పెట్టెను". (2 రాజు.23:34) సంబంధాన్ని తెలియజేసే పేరుకి ఉదాహరణగా క్రింది పేర్లను చెప్పవచ్చు. "ప్రాణము పోవుచుండగా ఆమె అతని పేరు బెనోని అనెను. బెనోని అనగా నా ధుఃఖపుత్రుడు" అని అర్ధం. (ఆది.35:18) "లేయా గర్భవతియై కుమారుని కని, యెహోవా నా శ్రమను చూసియున్నాడు కనుక నా పెనిమిటి నన్ను ప్రేమించును గదా అనుకొని అతనికి రూబేని అను పేరు పెట్టెను." (ఆది.29:32)

బైబిలులో కొన్ని సార్లు సంభవాల్ని బట్టి నామకరణం జరిగేది. ఉదా: "నీవు త్వరపడి అక్కడికి తప్పించుకొని పొమ్ము. నీవక్కడ చేరువరకు నేనేమియు చేయననెను. అందుచేత ఆ ఊరికి "సోయరు" అను పేరుపెట్టబడెను." సోయరు అనగా "చిన్నది" అని అర్ధం." (ఆది. 19:22) పేర్లు ఒక్కోసారి నిరీక్షణ గాని, లేదా ప్రవచనాన్ని గాని వ్యక్తీకరించేవిగా ఉండేవి. ఉదా: "నేను ప్రవక్త్రి యొద్దకు పోతిని, ఆమె గర్భవతియై కుమారుని కనగా యెహోవా అతనికి "మహేరు షాలాల్ హాష్ బజ్" అను పేరు పెట్టెను. అనగా త్వరితముగా దోపుడగును, ఆతురముగా కొల్లపెట్టబడును అని అర్ధం." (యెష.8:1-4) బైబిలులో వ్యక్తికి, అతని పేరుకి చాల దగ్గర సంబంధముంది. కాబట్టి ఫలానా పేరుని నిర్మూలం చేయడమంటే ఆ వ్యక్తిని లేకుండా చేయడమేనని అర్ధం. ఉదా. (సంఖ్యా.24:4) "అతనికి కుమారులు

లేనంత మాత్రం చేత మా తండ్రిపేరు అతని వంశంలో నుండి మాసిపోనేల?", (ద్వితీ 7:24) "నీవు ఆకాశము క్రిందనుండి వారి నామమును నశింపజేయవలెను."

**బైబిలులో కనిపించే వివిధరకాల పేర్లు:**

<u>కార్య జ్ఞాపకార్థంగా పెట్టబడ్డ పేర్లు</u>: ఉదా: ఇశ్రాయేలు= దేవునితో పోరాడువాడు; శ్రా-శారాయి; అబ్రాము- అబ్రహాము; యాకోబు- ఇశ్రాయేలు

<u>వృత్తి ఆధారంగా పెట్టబడ్డ పేర్లు</u>: ఉదా: ఆసా= వైద్యుడు

<u>సౌందర్యం ఆధారంగా పెట్టబడ్డ పేర్లు</u>: ఉడ్: రూతు= సౌందర్యం; సప్పీరా= సొగసు; ఆదా= అలంకారం

<u>ఆనందం, సంతోషం మొదలగు వాటి ఆధారంగా పెట్టబడ్డ పేర్లు</u>: ఉదా: నయోమి= సంతోషం; ఏదేను= ఉల్లాసం; ఎరస్తు= ప్రియమైన

<u>జంతువుల పేర్లాధారంగా పెట్టబడ్డ వ్యక్తినామాలు</u>: ఉదా: దోర్కా= లేడి; కాలేబు= కుక్క; దెబోరా= తేనెటీగ

<u>వృక్ష సూచక నామాలు</u>: ఉదా: తామారు= ఈతచెట్టు; బేతనీయ= ఖర్జూరపండ్ల ప్రదేశం.

<u>భయసూచక వ్యక్తి నామాలు</u>: ఉదా: గిద్యోను= పడద్రోయువాడు; బారాకు= మెరుపు

<u>తల్లిదండ్రులు తాము పొందిన ప్రార్థనా ఫలితాల జ్ఞాపకంగా పెట్టిన పేర్లు</u>: ఉదా: సమూయేలు= దేవుడు మనవి నాలకించెను; యోహాను= యెహోవా వరం

<u>రాబోయే తరాలవారు దేవుని నిరీక్షించేటట్లు పెట్టబడ్డ పేర్లు</u>: ఉదా: నోవహు= నెమ్మది; హోషేయ= యెహోవా రక్షించును

<u>వైయక్తిక లక్షణాలని సూచించే పేర్లు</u>: ఉదా: యాకోబు= మోసగాడు; కేఫా= రాయి

<u>దేశంలో కలిగిన సంఘటనని బట్టి పెట్టబడ్డ పేరు</u>:ఉదా: ఈకాబోదు= మహిమ తొలగెను

<u>దైవ సంబంధనామాలు, దేవతా సూచక నామాలు</u>: ఉదా ఏల్= దేవుడు. దానియేలు, సమూయేలు; మెలెకు= రాజు, అబీమెలెకు; అపొల్లో=అపొల్లో దేవత సంబంధి

<u>శరీర ఆకారాన్ని సూచించే పేర్లు</u>: ఉదా: లెమెకు= బలముగల; కెలాయా= మరుగుజ్జు

<u>పక్షినామ సూచకాలు</u>: ఉదా యోనా= గువ్వ; అకుల= గ్రద్ద

<u>పర్వత నామ సూచకాలు</u>: ఉదా: గిబ్యా= కొండ

<u>అన్యదేశ సూచక నామాలు</u>: ఉదా: యావాను= యవన (గ్రీసు) దేశం నుండి వచ్చినవాడు; అకాయకు= అకయ నుండి వచ్చిన వాడు

ఈ విధంగా బైబిలులోని పేర్లు వారి విశ్వాసాల్నే కాక, వ్యక్తి గుణాల్ని, వృత్తిని, విధుల్ని, పరిసరాల్ని సూచించేవిగా ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాదు వారు పేర్లని ఎంతో అర్థవంతంగా పెట్టేవారని తెలుస్తుంది. ఈ పేర్ల ద్వారా నాటి ప్రజల విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు తెలుస్తున్నాయి. "ఏల్" అనగా హీబ్రూ భాషలో "దేవుడు" అని అర్థం. ఉదా; ఏల్ ఎలోహేయి ఇశ్రాయేలు= ఇశ్రాయేలు దేవుడే దేవుడు; ఎల్తెకోను= దేవుడు స్థిరుడు. ఇలాంటి పేర్లని బట్టి ఈశ్రాయేలీయులు యెహోవా దేవుని ఆరాధించినట్లు తెలుస్తుంది. బేల్దాగోను= దాగోను దేవత నివాసం; బేత్పెయోరు= పెయోరు దేవతా గృహం; బెత్షెమెషు= సూర్యదేవత ఇల్లు ఇత్యాది పేర్లను బట్టి పాత నిబంధన కాలంలో యూదామతమే కాకుండా ఎన్నో అన్యమతాలు, ప్రకృతి ఆరాధనలు ఉన్నట్లు తెలుస్తుంది.

వ్యక్తినామాలవలే స్థలనామాల ద్వారా కూడ నైసర్గిక స్వరూపాలు, భౌగోళిక పరిస్థితులు, ప్రజల మతాలు, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు తెలిసికోవచ్చు.

ఉదా: అర్బా= అర్బా అనే వ్యక్తి కట్టించిన ఊరు
హోరా= కొండప్రదేశం
అరేబియా= ఎడారి ప్రదేశం
బేతేలు= దేవుని ఇల్లు
మారా= చేదుజలం
హవీలా= ఇసుకభూమి
లెబనోను= తెల్లని ప్రదేశం
ఐనోను= ఊటలు
బేత్షిత్తా= తుమ్మచెట్ల స్థలం
తప్పూయహు= రేగుచెట్టు
ఈర్నాహాషు= నాగులపట్టణం
అరాదు= అడవిగాడిద
అకెల్దమ= రక్తభూమి
ఆదాము= ఎఱ్ఱని
కూషు= నలుపు
బెత్లెహేము= రొట్టెల ఇల్లు
యెరూషలేము= సమాధానపురం
యాబేషు= నీళ్ళులేనిది

గొల్గొతా= కపాల స్థలం

ఈ విధంగా బైబిలులోని వ్యక్తినామాల్ని, స్థల నామాల్ని పరిశీలిస్తే బైబిలు పేర్లు క్రైస్తవ విశ్వాసానికి, సంస్కృతీ చరిత్రలకు, నాటి ఆచార వ్యవహారాలకు ప్రతిబింబాలని అర్థమవుతుంది. అంతేకాదు బైబిలు చరిత్ర వాస్తవమైనదని కూడ తెలుస్తుంది. నామకరణంలో పూర్వులు సిద్ధహస్తులని తెలుస్తుంది. అంతేకాక క్రైస్తవులంగా మనం మన పిల్లలకు అర్థవంతంగా నామకరణంచేయాలని కూడా అవగతమవుతుంది.